
సాక్షి ఒడిశా


ఆదివారం । 15 । అక్టోబర్ । 2023



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ. 5,40,132
బంగారం	22 గ్రాముల 600 మిల్లీ గ్రాములు
వెండి	275 గ్రాముల 850 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



మండపం అదరహో..

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు వేళయ్యింది. ఆదివారం నుంచి ప్రారంభం కానున్న వేడుకలకు మండపాలు ముస్తాబయ్యాయి.

- 10లో▸



2401 కేసుల పరిష్కారం

కొరాపుట్ జిల్లాస్థాయి లోక్ అదాలత్ కార్యక్రమంలో 2401 కేసులు పరిష్కరించినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

- 10లో▸

న్యూస్‌రీల్

బీజేడీ కార్యకర్తల ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ముదులి, కొండబాబు తదితరులు

రాయగడ: స్థానిక రింగ్ రోడ్డులో బీజేడీ కార్యాలయం ఏర్పాటై ఏడాది పూర్తయిన సందర్భంగా పార్టీ సీనియర్ కార్యకర్త ఎల్ల వెంకటేశ్వరరావు (కొండబాబు) నేతృత్వంలో శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. ముందుగా కొత్తబస్టాండ్ వద్ద దివంగత బిజు పట్నాయక్ విగ్రహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం రింగురోడ్డు వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మకరంద ముదులి మాట్లాడుతూ సీఎం నవీన్ పట్నాయక్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లడమే ర్యాలీ ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ సభ్యుడు గౌరి శంకరరావు, జిల్లా పరిషత్ సభ్యులు ధవళేశ్వర్‌నాయుడు, సీనియర్ కార్యకర్త కాశినాయుడు పాల్గొన్నారు.

ఆటల పోటీలు ప్రారంభం



కుంద్రాలో ఆటల పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పద్మిని

జయపురం: కుంద్రా సమితి స్థాయిలో జిల్లా స్వతంత్ర్య అభివృద్ధి పరిషత్ ఆధ్వర్యంలో శనివారం ఆటల పోటీలను కొట్‌పాడ్ ఎమ్మెల్యే పద్మిని దియాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ యువతలో క్రీడా స్ఫూర్తిని కలిగించాలన్న లక్ష్యంతో ప్రతి సమితిలో క్రీడా పోటీలను ప్రభుత్వం నిర్వహిస్తోందని వెల్లడించారు. శ్రీఅరవింద శిక్షానికేతన్ మైదానంలో నిర్వహించిన ఈ పోటీల్లో 16 పంచాయతీల నుంచి 16 వాలీబాల్, 16 ఫుట్‌బాల్ టీమ్‌లు పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన వారు జిల్లాస్థాయిలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి మమతా మహంతి, స్వతంత్ర అభివృద్ధి పరిషత్ సభ్యులు మంగు బురుద, అదనపు బీడీఓ రామప్రసాద్ దొర, అరవింద శిక్షా నికేతన్ ప్రధాన ఉపాధ్యాయులు ప్రభాతి సెట్టి,సమితి సంక్షేమ అధికారి సుంజన్ రంజన్ జాలి జిపిఓ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే ఓడీఆర్‌పీ పనులు పూర్తి



మాట్లాడుతూన్న మేయర్ సంఘమిత్ర

బరంపురం: నగరంలో త్వరలోనే ఓడీఆర్‌పీ(ఒడిశా డిజాస్టర్ రికవరీ ప్రాజెక్ట్) కింద చేపట్టిన పనులు పూర్తి చేస్తామని నగర మేయర్ సంఘమిత్ర దొళాయి చెప్పారు. బరంపురం మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) సమావేశ మందిరంలో కార్పొరేటర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రహదారులు, కాలువల నిర్మాణం, మురికివాడల అభివృద్ధికి ఇప్పటికే డీపీఆర్ ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. టెండర్ పూర్తయిన వెంటనే పనులు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీ చంద్రశేఖర్ సాహు, ఎమ్మెల్యే విక్రమ్ పండా, కమిషనర్ సోనాలి జెన్నా తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు జూదరుల అరెస్టు



పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు

బరంపురం: గంజాం జిల్లా ఛత్రపూర్‌లో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.21,790నగదు, ఆరు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఐఐసీ అధికారి అభిమన్య దాస్ అందించిన సమాచారం ప్రకారం శనివారం ఈ దాడులు జరిపినట్లు పోలీసులు తెలిపారు.

• అంబరాన్నంటిన సంబరాలు



ప్రత్యేక అలంకరణలో మాకాళువ అమ్మవారు



తాత్కాలిక మందిరానికి బయలుదేరిన అమ్మవారి ప్రధాన ఘటం



పూజలందుకుంటున్న మా కాళువ అమ్మవారు

స్థానిక గుసానినువాగంలో మా కాళువా సంబరాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం అర్ధరాత్రి నుంచి మేళ తాళాల మధ్య ఊరేగింపు చేపట్టారు. శనివారం ఆలయ తాత్కాలిక ప్రాంగణంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణ ఆకట్టుకుంది.

– బరంపురం



ఆకట్టుకుంటున్న అమ్మవారి కొళాకుంజలు

కరుణించమ్మా.. దండుమారెమ్మ!

• తెరుచుకున్న అమ్మవారి గుడి తలుపులు
• విజయదశమి ఉత్సవాలు ప్రారంభం



పర్లాకిమిడిలో కొలువుదీరిన దండుమారెమ్మ అమ్మవారు



విజయదశమికి సిద్ధమవుతున్న ఆలయం

పర్లాకిమిడి: ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవం దండుమారెమ్మ ఆలయం దసరా ఉత్సవాలకు సన్నద్ధమైంది. పర్లాకిమిడిలోని డోలాట్యాంకు రోడ్డులో దండుమారెమ్మ అమ్మవారికి చాలా ప్రత్యేకత ఉంది. ఇక్కడ ఏడాదికి ఒక్కసారి మాత్రమే గుడి తలుపులు తెరుస్తారు. ఆలయంలో పొడవైన పుట్ట, అమ్మవారి విగ్రహం నుంటుంది. గత ఏడాది విజయ దశమి పండుగ మరుసటి రోజు అఖండ దీపం వెలిగించి, కొబ్బరికాయ ఉంచి గుడితలుపులు మూసివేశారు. ఈ ఏడాది ఆనవాయితీ ప్రకారం విజయదశమికి ముందు వారం గుడి తలుపులు తెరిచారు.

చరిత్రాత్మకం..

సుమారు 75 ఏళ్ల కిందట దండు మారెమ్మ ఆలయంలో పెద్ద పుట్ట ఏర్పడింది. ఒకరోజు పూజారి గుడి తలుపులు తెరవగానే పెద్ద కాలసర్పం అమ్మవారి ముంగిట కనిపించింది. దాంతో ఆ ప్రాంతవాసులు భయభ్రాంతులకు గురయ్యారు. అప్పటి నుంచి విజయదశమికి వారంరోజుల ముందు మాత్రమే అమ్మవారి తలుపులు తీయడం ఆనవాయితీగా చేసుకున్నారు. ఆ సమయంలో అనేకమంది భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకుంటారు. సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసే భక్తులు అమ్మవారికి అన్నప్రసాదాలు, ఉత్సవాలకు సహాయపడుతారు. అమ్మవారి గుడిలో ఏడాది క్రితం ఉంచిన కొబ్బరికాయ కుళ్లిపోకుండా అలాగే ఉండటం విశేషం. దీనిని గుడితలుపులు తెరచిన తరువాత భక్తులకు నైవేద్యంగా పంపిణీ చేస్తారు.

శాస్త్రోక్తంగా..

దండుమాల వీధిలో ఈ నెల 15 నుంచి 24 వరకూ దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. వచ్చే మంగళవారం విజయదశమి పూర్తయ్యాక అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజలు చేసి గుడి తలుపులు మూసేస్తారు. ఈ ఉత్సవాలకు స్థానికులతో పాటు ఆంధ్రా, ఛత్తీస్‌గఢ్, చెన్నై, ఆంధ్రా, తెలంగాణా తదితర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు తీర్చుకుంటారని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కారేగి సతీష్ తెలిపారు. ఈ నెల 21న అన్న ప్రసాద వితరణ ఉంటుందని పేర్కొన్నారు.తెలిపారు.

హత్య కేసులో మాజీ మంత్రికి సమన్లు



ప్రతాప్ కుమార్ జెనా

భువనేశ్వర్: మహంగా జంట హత్యల కేసుకు సంబంధించి సాలేపూర్ ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు (జేఎంఎఫ్‌సీ) అధికార పక్షం బిజు జనతా దళ్ (బీజేడీ) సిటింగ్ ఎమ్మెల్యే, మాజీ న్యాయశాఖ మంత్రి ప్రతాప్ కుమార్ జెనాకు సమన్లు జారీ చేసింది. ప్రత్యేక మెసెంజర్ శనివారం ఎమ్మెల్యే అధికారిక నివాసంలో వీటిని అందజేశాడు. హత్య కేసులో నిందితుడిగా ఉన్న మాజీ న్యాయమంత్రిపై నేరాలను స్పష్టీకరించిన కొద్ది రోజుల్లో కోర్టు సమన్లు జారీ చేయడం గమనార్హం. ఈ నెల 6న న్యాయ స్థానం నిందిత ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నమోదైన ఆరోపణలు నేరపూరితమని ప్రకటించింది. ఈ నెల 31న న్యాయస్థానంలో ప్రత్యక్షంగా హాజరు కావాలని సమన్లు జారీ చేసింది. ఫిర్యాదుదారు, సాక్షులు మరియు అందుబాటులో ఉన్న ఇతర ఆధారాలు, వాంగ్మూలాలను పరిశీలించిన న్యాయస్థానం నిందిత ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ జెనాకు వ్యతిరేకంగా భారతీయ శిక్షాస్మృతి సెక్షన్ 302 (హత్య), 506 (హత్య బెదిరింపు), 120 – బి (నేరపూర్వక వ్యూహం) కింద నేరాలకు ప్రాథమికంగా శిక్షార్హుడిగా పరిగణించినట్లు స్పష్టం చేసింది. 2023 సెప్టెంబర్ 25న జారీ చేసిన ఉత్తర్వుల్లో న్యాయస్థానం ఈ విషయం పేర్కొంది. 2021 జనవరి 2న మహంగా మండల అధ్యక్షుడు కులమణి బొరాల్ (75), అతని సహచరుడు దివ్యసింగ్ బొరాల్ (80) బైక్‌పై ఇంటికి తిరిగి వస్తుండగా మహంగా తహసిల్ జంకోటి గ్రామ సమీపంలో గుర్తు తెలియని దుండగులు నరికి చంపిన సంగతి తెలిసిందే.

వధువు వయసు 65 వరుడికేమో 63



వివాహ వేడుకలో వధూవరులు

భువనేశ్వర్: వధువు వయసు 65.. వరుడికేమో 63 ఏళ్లు. మూడొంతుల బతుకు అయిపోయాక ఇద్దరికీ ఏమీ మిగల్లేదు. కన్నీళ్లు, కష్టాలు తప్ప కన్నబిడ్డలు కూడా తోడు నిలవలేదు. ఇలాంటి స్థితిలో వారిద్దరూ ఒక్కటయ్యారు. ఏ ఆదరణ లేని జీవనంలో ఒకరికొకరు తోడుగా ఉండి శేష జీవితం గడపాలని నిర్ణయించుకున్నారు. సహచరుల సాయంతో ప్రేమ వివాహం చేసుకున్నారు. బాలేశ్వర్ శివారు బాముపొదా కుష్ఠు ఆశ్రమంలో జరిగిందీ అపురూప వివాహ వేడుక. పూర్తి వివరాల్లోకి వెళితే..

బాలాసోర్ జిల్లా ఔపడా మండలం జుడా గ్రామస్తురాలు పద్మావతి పదేళ్ల కిందట కుష్ఠు వ్యాధి బారిన పడింది. అంతే కుటుంబ సభ్యులంతా ఆమెను దాదాపు వెలివేశారు. దీంతో ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయి చికిత్స కోసం బాముపొదా కుష్ఠు వ్యాధి ఆశ్రమంలో చేరారు. చికిత్స విజయవంతం కావడంతో ఆమె వ్యాధి నుంచి విముక్తి పొందారు. కానీ వ్యాధి కంటే ఎక్కువగా ఇబ్బంది పెట్టిన కుటుంబ సభ్యుల వద్దకు వెళ్లడానికి ఆమె ఇష్టపడలేదు. ఆశ్రమంలోనే ఉండిపోయారు.

ఇక బాలేశ్వర్ సదరు మండలం సార్థ గ్రామస్తుడు దాస మరాండి కూడా కుష్ఠు వ్యాధిగ్రస్తుడే. ఆశ్రమంలో మూడేళ్ల పాటు చికిత్స తీసుకున్నాక కోలుకున్నారు. వ్యాధి నయమైనా ఆయన కూడా ఇంటికి వెళ్లకుండా ఆశ్రమంలోనే ఉండిపోయారు. ఈ నేపథ్యంలో ఆశ్రమంలోనే ఇద్దరికీ పరిచయమైంది. దాదాపు జీవితమంతా చూసేసిన వీరికి ఈ జీవన సంధ్యలో తోడొకరుంటే బాగుంటుందని తోచింది. రెండు నెలల క్రితం దాస మారండి పద్మావతికి ఈ ప్రతిపాదన పెట్టారు. కానీ ఆమె ఒప్పుకోలేదు. విషయం తెలుసుకున్న తోటి ఆశ్రమ వాసులు ఇరువురినీ ఒప్పించారు. దీంతో ఆమె ఒప్పుకోవడంతో ఆశ్రమంలో వైద్యురాలు సుమిత్రా డే తన సొంత ఖర్చుతో వారి వివాహాన్ని నిర్వహిస్తానని హామీ ఇచ్చారు. ముందస్తు ప్రణాళిక ప్రకారం ఇరువురి వివాహం ఆశ్రమం ఆవరణలోని జగన్నాథ ఆలయంలో వేడుకగా జరిపించారు. హిందూ ఆచార సంప్రదాయాల ప్రకారం జరిగిన వీరి పెళ్లి మండపం ప్రాంగణం శంఖ ధ్వనితో మారు మోగింది. ఓ చిన్నారి ఈ కొత్త దంపతుల బ్రహ్మ ముడిని విప్పడం చూపరులకు ముచ్చట కలిగించింది. జిల్లా ప్రధాన వైద్యాధికారి డాక్టర్ దులాల్ సేన్ జగదేవ్, అదనపు జిల్లా ప్రధాన వైద్యాధికారి డాక్టర్ మృత్యుంజయ్ మిశ్రా వివాహ వేడుకలో ప్రముఖంగా పాల్గొని వారిద్దరి వైవాహిక జీవితం సంతోషంగా సాగాలని ఆకాంక్షించారు.

'రక్తదానం ప్రాణదానం'



శిబిరంలో రక్తదానం చేస్తున్న దాతలు

జయపురం: రక్తదానం నిస్సహాయుల ప్రాణాలు కాపాడుతుందని బొరిగుమ్మ బైవరవ +2 కళాశాల కమిటీ అధ్యక్షుడు కె.నాగరాజు స్వచ్ఛంద రక్తదాన శిబిరంలో దొర అన్నారు. బొరిగుమ్మ బైవరవ +2 కళాశాల జాతీయ సేవా యోజన, రెడ్‌క్రాస్, సంబాద్-అమొ ఒడిశా సంయుక్తంగా కళాశాలలో శనివారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ట్రస్టు అధ్యక్షుడు రామచంద్ర పాఢి, కె.నాగరాజు దొరలు రక్తదాన శిబిరం ప్రారంభించారు. కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ బి.చిరంజీవి, యూత్ రెడ్‌క్రాస్ కౌన్సిలర్ సౌమేంద్ర స్వాయ్, జాతీయ సేవా యోజన అధికారి సదాశివ త్రిపాఠి, సంబాద్-అమొ ఒడిశా బొరిగుమ్మ ప్రతినిధి విశ్వజిత్ పాణిగ్రాహి రక్తదాన శిబిరాన్ని పర్యవేక్షించారు. కొరాపుట్ రక్త భండార్ సిబ్బంది, బొరిగుమ్మ కమ్యూనిటీ హాస్పిటల్ వైద్య సిబ్బంది దాతల నుంచి 40 యూనిట్ల రక్తం సేకరించారు. రక్తదానం చేసిన వారిలో యూత్ రెడ్‌క్రాస్ కౌన్సిలర్ సౌమేంద్ర కుమార్, నవీన్ భుయ్, రుద్ర ప్రసాద్ తరిణి, భవానీ చందన మహంకుడొ, మోహణ సింగ్ నాయిక్, సందీప్ కుమార్ సెఠీ తదితరులు ఉన్నారు. వీరికి ప్రశంసా పత్రాలు పంపిణీ చేశారు.



రక్తదాతలతో సేవా సంస్థల ప్రతినిధులు

ముగిసిన పితృ పక్షం



జాజ్‌పూర్ విరజా శక్తి పీఠం ప్రాంగణం నాభి గయ ఆవరణలో పిండ ప్రదానాలు

భువనేశ్వర్: అశ్వని మాసం కృష్ణ ప్రతిపద తిథి నుంచి ప్రారంభమైన పవిత్ర మహాలయ పక్షం శనివారం అమావాస్యతో ముగిసింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో ప్రముఖ తీర్థ క్షేత్రాలు, పుష్కరిణి, పూరీ మహాదధి తీర్థాలు పిండ ప్రదాన పూజలతో కిటకిటలాడాయి. జాజ్‌పూర్ విరజా మాత శక్తి పీఠం సముదాయంలో నాభి గయ పిండ ప్రదానం ప్రక్రియకు ప్రసిద్ధి. నాభి గయలో పితృ దేవతలకు పూజించే ప్రత్యేక సంప్రదాయం ఉంది. మహాలయ అమావాస్య నాడు ఈ ప్రాంగణంలో పిండ ప్రదానం అత్యంత మోక్షదాయకంగా భావిస్తారు. ఈ సందర్భంగా రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ నిర్వాహకులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు.

శ్రీ మందిరం మెట్లపై నివారణ

శ్రీ జగన్నాథ స్వామి ప్రధాన ఆలయం శ్రీ మందిరం సింహ ద్వారం ఆవరణలో 22 మెట్లు మీద పిండ ప్రదానం చేయడం ఆచారంలో భాగం. ఈ ఏడాది పాలన యంత్రాంగం నివారించింది. శ్రీ మందిరం ఉత్తర ద్వారం ఆవరణలో పితృ దేవతలకు పిండ ప్రదానం చేసేందుకు అవకాశం కల్పించారు.

'ఇంటింటికీ కాంగ్రెస్' ప్రచారం ప్రారంభం



నందపూర్ నుంచి ప్రారంభమైన ఇంటింటికీ కాంగ్రెస్‌లో పాల్గొన్న నాయకులు

జయపురం: ఇంటింటికీ కాంగ్రెస్ పేరుతో ఆ పార్టీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించింది. ఇంటింటికీ కాంగ్రెస్, ఇంటింటికీ హస్తం ప్రచార కార్యక్రమం నందపూర్ ప్రసిద్ధ సర్వేశ్వర మందిరం నుంచి ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు దుర్గా ప్రసాద్ సాహు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నందపూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కామేష్ కాముడి నేతృత్వంలో వందలాది మంది కార్యకర్తలు కార్యక్రమంలో పాలు పంచుకున్నారు. సర్వేశ్వర మందిరం నుంచి ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. గతంలో కాంగ్రెస్ చేసిన అభివృద్ధిని వివరించారు. మోదీ రూ.15లక్షలు ప్రతి ఒక్కరి ఖాతాలో జమ చేస్తానని చెప్పి చేయలేదని గుర్తు చేశారు. పదేళ్ల మోదీ పాలనలో హామీలేవీ అమలు చేయలేదని విమర్శించారు. రాష్ట్రంలో బీజేడీ పాలనలో శాంతిభద్రతలు క్షీణించాయని, వైద్య వ్యవస్థ ప్రమాదకరంగా మారిందని అన్నారు. కార్యక్రమంలో పొట్టంగి మాజీ ఎమ్మెల్యే రామచంద్ర కడమ్, మల్కన్‌గిరి మాజీ ఎమ్మెల్యే నిమైయ్ సర్కార్, రాజపుట్ పంచాయతీ సర్పంచ్ పితాంబర కిరసాని, గోపాల మటమ్, సంజీవ ఖొర, మధన్ హడపుటియ, అతో పాటు నందపూర్, సిమిలిగుడ, పొట్టంగి,సమితిల నుంచి వందలాది మంది పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రచార పత్రాలు పంచుతున్న కార్యకర్తలు

క్లుప్తంగా

నౌర్లా నుంచి పోటీకి అభ్యర్థన



ముఖ్యమంత్రితో నౌర్లా ఎమ్మెల్యే భూపిందర్ సింఘ్(ఫైల్)

భువనేశ్వర్: పశ్చిమ ఒడిశా కలహండి జిల్లా నౌర్లా నియోజకవర్గం నుంచి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ పోటీ చేయాలని ఆ నియోజకవర్గం సిటింగ్ ఎమ్మెల్యే భూపిందర్‌సింగ్ ఆకాంక్షిస్తున్నారు. ఈ విషయాన్ని ఆయన బిజూ జనతాదళ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రణబ్ ప్రకాష్‌దాస్‌కు తెలియజేసినట్లు తెలిపారు. 2019లో ముఖ్యమంత్రి పశ్చిమ ఒడిశా బిజేపూర్, గంజాం జిల్లా హింజిలికాటు నియోజకవర్గాల నుంచి పోటీ చేశారు. వచ్చే ఏడాది జరగాల్సిన ఎన్నికల్లో ఆయన సొంత నియోజకవర్గం హింజిలీకాటుతో పశ్చిమ ఒడిశా కలహండి జిల్లా నుంచి నౌర్లా రెండో స్థానంగా ఎంచుకుని పోటీ చేస్తారా? అనే విషయం చర్చనీయాంశమైంది.

ధవళముఖి అలంకరణలో సమలేశ్వరి



మాతా సమలేశ్వరి దేవి

భువనేశ్వర్: పవిత్ర మహాళయ అమావాస్య పురస్కరించుకుని శనివారం సంబల్‌పూర్ ఆరాధ్య దేవత సమలేశ్వరి ధవళముఖి అలంకరణతో శోభిల్లింది. అమ్మవారిని ఈ అలంకరణలో దర్శించుకుంటే పితృ తర్పణం పురస్కరించుకుని గంగా నదిలో స్నానం ఆచరించిన ఫలం దక్కుతుందని భక్తుల నమ్మకం. మహాళయ పక్షం పితృకార్యాలకు అత్యంత పవిత్రమైనది. అందుకే అమావాస్య నాడు సమలేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. ఏడాదికోసారి మాత్రమే దర్శనం కలిగే అవకాశం ఉండటంతో భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ట్రస్ట్ బోర్డు వర్గాలు తెలిపాయి.

ఉత్సాహంగా సినిమా షూటింగ్



సన్నివేశం చిత్రీకరిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో రెండు రోజులుగా ఒడియా సినిమా 'పోరోబో' షూటింగ్ ఉత్సాహంగా సాగుతోంది. ఆంధ్రా– ఒడిశా సరిహద్దు సమస్యపై ఈ సినిమా చిత్రీకరణ జరుగుతున్నట్లు సమాచారం. పర్లాకిమిడి కలెక్టరేట్, రాజవీధిలో ప్యాలస్, ఆంధ్రా ఒడిషా సరిహద్దుల్లో కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా పలాస ఎమ్మెల్యే, కలెక్టర్‌ను వ్యతిరేకిస్తూ జూనియర్ ఆర్టిస్టులు నినాదాలు చేయడాన్ని చిత్రీకరించారు. శ్రీకాకుళం కలెక్టర్‌గా ప్రముఖ నటుడు సిద్ధాంత మహాపాత్రో, గజపతి జిల్లా కలెక్టర్‌గా అన్ను చౌదరి నటిస్తున్నారు. మరో నెలరోజుల పాటు షూటింగ్ జరుగుతుందని దర్శకుడు చిన్మయ్ దాస్ తెలిపారు.

బాలికలను దత్తత తీసుకున్న స్పెయిన్ దంపతులు



స్పెయిన్ దేశస్థులతో అనాథ బాలికలు, కలెక్టర్

పర్లాకిమిడి: జిల్లా పోష్యసంతాన కేంద్రం నుంచి ఇద్దరు బాలికలను (6, 4 ఏళ్ల వయస్సు) స్పెయిన్ దేశానికి చెందిన దంపతులు దత్తత తీసుకున్నారు. ఆర్.ఉదయగిరి ప్రాంతంలో ఇద్దరు బాలికలు కోవిడ్ మహమ్మారి సమయంలో తల్లిదండ్రులను పోగోట్టుకున్నారు. వీరిని జిల్లా శిశు సంరక్షణ అధికారులు చేరదీసి 'నిస్వాస్ సలోం' శిశు సంరక్షణ కేంద్రంలో ఉంచారు. వీరి ఫొటోలను కేంద్ర సంతాన దత్తత పోర్టల్‌లో అప్‌లోడ్ చేయగా స్పెయిన్ దంపతులు మేక్సిమో బుల్‌మార్సల్, మేరియా యోలండా గేవ్ గసరుల్ మూడేళ్ల కిందట ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. వీరిని గజపతి జిల్లా కలెక్టరేట్‌కు ఆహ్వానించి శుక్రవారం ఇద్దరు బాలికలను అందజేశారు. కార్యక్రమంలో అదనపు జిల్లా మేజిస్ట్రేటు రాజేంద్ర మింజ్, డి.సి.పి.యు.అరుణ్ కుమార్ త్రిపాఠి, ఆఫా ప్రతినిధి దిలీప్‌కుమార్, జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి అశ్వినీకుమార్ మహాపాత్రో, బిచిత్రానంద పాణి, నిస్వాస్ సలోం పోష్య సంతాన కేంద్రం అధికారి ప్రత్యూష్‌కుమార్ సూర్య తదితరులు పాల్గొన్నారు.

మండపం అదరహో..!



పాత బస్టాండ్‌లో తుదిమెరుగులు దిద్దుకుంటున్న అమ్మవారు



హన్‌మాన్ జంక్షన్‌లో విద్యుత్‌కాంతులతో మండపం

నగరంలోని పలు కూడళ్లలో దుర్గాదేవి మండపాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ నెల 15 నుంచి కొమ్మపల్లి, స్టేషన్‌రోడ్డు, గిరి మార్కెట్, గిరిజా జంక్షన్, హన్‌మాన్‌బజార్, భేజీపూర్, గుసానినువాగం తదితర ప్రాంతాల్లో అమ్మవారిని కొలువుదీర్చనున్నారు. ఈ నేపథ్యంలో పూజా కమిటీలు ఆకర్షణీయంగా పెండాల్స్ తీర్చిదిద్దారు. ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా బరంపురం ఎస్పీ సార్వణ్ వివేక్ ఆదేశాల మేరకు పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

– బరంపురం



కొమ్మపల్లిలో దుర్గా పండాల్

గుప్త గుండిచా యాత్ర ప్రారంభం



దుర్గా మాధవుని గుప్త గుండిచా యాత్ర

భువనేశ్వర్: శ్రీమందిరంలో గుప్త గుండిచా యాత్ర ప్రారంభమైంది. నిరవధికంగా తొమ్మిది రోజుల పాటు యాత్ర కొనసాగుతుంది. నవ దినాత్మక శాక్త గుండిచా యాత్రగా ప్రసిద్ధి చెందిన ఈ యాత్రలో స్వామి గోప్యంగా శ్రీ మందిరానికి తిరిగి వస్తారు. శారదీయ దుర్గా పూజలు సందర్భంగా మాధవుడు లక్ష్మీ స్వరూప దుర్గా దేవితో గోప్య గుండిచా యాత్రలో పాల్గొంటారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక పూజాదులతో విశేష నైవేద్యం సమర్పిస్తారు. జగన్నాథ సంస్కృతిలో దుర్గా మాధవ ఉపాసనకు ప్రతీకగా ఈ యాత్ర నిర్వహిస్తారు. జగన్నాథుడు మహాలక్ష్మి స్వరూప దుర్గా మాత సమేతంగా గుప్త గుండిచా యాత్రలో డోలో మండప వీధిలో నారాయణి ఆలయానికి వెళ్తాడు. ఏటా జరిగే వార్షిక రథ యాత్రలో ప్రియ సఖి మహా లక్ష్మిని వీడి సోదర సోదరి సమేతంగా స్వామి గుండిచా సందర్శనకు వెళ్లడం తెలిసిందే. ఈ సందర్భంగా తీవ్ర మనస్తాపానికి గురైన మహాలక్ష్మిని ఊరడించేందుకు స్వామి పలు విధాల ప్రయత్నిస్తారు. రథ యాత్ర అంతిమ ఘట్టం నీలాద్రి విజే పురస్కరించుకుని వడివడిగా శ్రీమందిరంలోనికి ప్రవేశించబోయే సమయంలో మహాలక్ష్మి అడ్డు తగులుతుంది. రత్నవేదికపై యథావిధిగా ఆసీనం అయ్యేందుకు ఉరకలేసుకుని నంది ఘోష్ రథం దిగి సింహద్వారం గుండా శ్రీమందిరం లోనికి ప్రవేశించేందుకు మహాలక్ష్మికి మరోసారి యాత్రగా వెళ్లే సమయంలో తనతో తీసుకువెళ్తానని చేసిన వాగ్దానం మేరకు ఏటా శారదీయ దేవీ పూజోత్సవాల్లో భాగంగా శాక్త గుండిచా గానీ, గుప్త గుండిచా యాత్ర నిర్వహించడం ఆచారంగా మారిందని జగన్నాథ తత్త్వవేత్తలు చెబుతుంటారు

'కలిసికట్టుగా పనిచేద్దాం'



బొరిగుమ్మ బీజేడీ జనసంపర్క యాత్రలో మాజీ మంత్రి రబినారాయణ నందో తదితరులు

జయపురం: కలిసికట్టుగా పనిచేస్తే విజయం సాధ్యమని మాజీ మంత్రి రబినారాయణ నందో పిలుపునిచ్చారు. జయపురం విధాన సభ నియోజకవర్గ పరిధి బొరిగుమ్మలో మాజీ మంత్రి నేతృత్వంలో శనివారం బీజేడీ వికాశ జన సంపర్క యాత్ర నిర్వహించారు. బొరిగుమ్మ దాసరి వీధిలో గల నీల మాధవ శివ మందిరంలో పూజలు చేసి నియోజకవర్గంలోని 19 పంచాయతీల నుంచి కార్యకర్తలు యాత్రలో పాల్గొన్నారు. వందలాది మందితో సాగిన యాత్ర శివ మందిరం నుంచి పాత బొరిగుమ్మ బ్రాహ్మణదేవి మందిరం వరకు జరిగింది. కార్యక్రమంలో రబినారాయణ ప్రసంగిస్తూ.. సీఎం నవీన్ పట్నాయక్ ఆధ్వర్యంలో చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. పథకాలను పార్టీ శ్రేణులు జనాల్లోకి తీసుకెళ్లాలని కోరారు. బీజేడీపై ఉన్న జనాదరణ ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు. పార్టీ కార్యకర్తలు ఎలాంటి విభేదాలు లేకుండా పనిచేయాలని సూచించారు. పాదయాత్రలో బీజేడీ మహిళా నేత్రి డాక్టర్ ఇందిరా నందో, జయపురం సమితి ఉపాధ్యక్షుడు గణేష్ ప్రసాద్ పాఢి, మహిళా బీజేడీ జిల్లా అధ్యక్షురాలు పార్వతీ మస్తి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు ప్రసాద్ బిడిక, బీజేడీజిల్లా కార్యదర్శి కె.నారాయణ దొర, బొరిగుమ్మ బీజేడీ అధ్యక్షులు దీప్తిమయి నాయిక్, ఉపాధ్యక్షులు దీప్తి మయి నాయిక్, బొరిగుమ్మ పార్టీ అధ్యక్షుడు రమేష్ బిశాయ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన



శిలా ఫలకాలు ఆవిష్కరిస్తున్న మంత్రి రాజేంద్ర



సభకు హాజరైన జనం

కొరాపుట్: సుమారు రు.70 కోట్లు విలువైన రోడ్లు, వంతెనల నిర్మాణాలకు రాష్ట్ర ప్లానింగ్, కో–ఆర్డినేషన్ మంత్రి రాజేంద్ర డొలకియా శంకుస్థాపనలు చేశారు. శుక్రవారం నబరంగ్‌పూర్ జిల్లా డాబుగాం విధాన సభ పరిధిలో మంత్రి సుడిగాలి పర్యటన చేశారు. పపడాహండి సమితి మైదల్‌పూర్, ముఖ్య ప్రాంతాలను సందర్శించిన అనంతరం కొసాగుమ్మ సమితి కొట్టాగాంలో ప్రత్యేక సభ నిర్వహించారు. నాలుగు చోట్ల 17 నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ ప్రాంతంలో నువాఖాయ్ పండగ జరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు సొంత ఖర్చుతో వస్త్రదానం చేశారు. కార్యక్రమంలో నబరంగ్‌పూర్ పార్లమెంట్ సభ్యుడు రమేష్ చంద్ర మజ్జి, డాబుగాం ఎమ్మెల్యే , జిల్లా ప్రణాళికా సంఘం అధ్యక్షుడు మనోహర్ రంధారి, నబరంగ్‌పూర్ జిల్లా పరిషత్ అధ్యక్షుడు మెతిరాం నాయక్, స్వతంత్ర మండలి జిల్లా ఉపాధ్యక్షురాలు భానుమతి పూజారి, పపడాహండి సమితి ఉపాధ్యక్షుడు టుట్టు బెహరా పాల్గొన్నారు.

2401 కేసుల పరిష్కారం



జిల్లా స్థాయి లోక్ అదాలత్‌లో కేసులు విచారిస్తున్న జిల్లా జడ్జి సత్యనారాయణ మిశ్రా తదితరులు

జయపురం: కొరాపుట్ జిల్లాస్థాయి లోక్ అదాలత్ కార్యక్రమంలో 2401 కేసులు పరిష్కరించినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. జాతీయ న్యాయ సేవా ప్రదీకరణ, రాష్ట్ర న్యాయ సేవా ప్రదీకరణల ఆదేశాల మేరకు శనివారం కొరాపుట్ జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ, జిల్లా జడ్జి సత్యనారాయణ మిశ్రా పర్యవేక్షణలో జిల్లా స్థాయి లోక్ అదాలత్‌ను జయపురం, కొరాపుట్, బొరిగుడ్డ, కొట్‌పాడ్, లక్ష్మీపూర్, దశమంతపూర్, సెమిలిగుడ, లమతాపుట్, కొరాపుట్ గ్రామ న్యాయాలయాలు, సెమిలిగుడలో అన్ని న్యాయస్థానాలు, జయపురం కొరాపుట్ సబ్‌డివిజన్‌లలో తహసీల్దార్, ప్రాంతీయ ట్రాన్స్‌పోర్టు కార్యాలయాలు, లేబర్ ఆఫీసుల్లో నిర్వహించారు. జయపురం జిల్లాకోర్టులో నిర్వహించిన అదాలత్‌లో జిల్లా జడ్జి, జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ అధ్యక్షుడు సత్యనారాయణ మిశ్రా, ఫ్యామిలీ కోర్టు జడ్జి పవిత్ర మోహణ సామల్, జడ్జి, జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ, లోక్ అదాలత్ శాశ్వత జడ్జి సుమన్ జెన, మహిళా కోర్టు జడ్జి అంజలి మాచ్‌ఖండ్, సివిల్ కోర్టు జడ్జి రేఖారాణి పండ, జయపురం సబ్‌డివిజన్ జడ్జి సంతోష్ కుమార్ బారిక్, ప్రథమ శ్రేణి జడ్జి పల్లవీ ప్రియదర్శిని, ప్రథమ శ్రేణి జడ్జి ఆదర్శ కుమార్ బెహరాలు కేసులు విచారించారు. నాలుగు మోటారు ప్రమాదాలు కేసులు పరిష్కరించి రూ. 55,90,000 నష్ట పరిహారం చెల్లించాలని తీర్పునిచ్చారు. అదాలత్‌లో 15 వివాహ సంబంధిత కేసులు, మరో 9 కుటుంబ సంబంధిత కేసులు పరిష్కరించారు. అలాగే 9 లేబర్ కేసులు పరిష్కరించడంతో పాటు కొరాపుట్ జిల్లాలో సబ్‌డివిజన్, తహసీల్దార్ తదితర కోర్టుల్లో 2064 కేసులు పరిష్కరించి రూ.3,81,092 లు వసూలు చేసినట్లు సుమన్ జెన వెల్లడించారు. ఈ అదాలత్‌లో సీనియర్ న్యాయవాదులు శొశానంద మిశ్ర, ఆనంద రథ్, శరత్ కుమార్ నాయిక్ తదితరులు పాల్గొన్నారు.

అట్టాడకు 'తెలుగు సాహితీ' పురస్కారం



రచయిత అట్టాడ అప్పలనాయుడు

శ్రీకాకుళం కల్చరల్: తెలు గు సాహిత్యంలో వివిధ ప్రక్రియల్లో ఉత్తమ గ్రంథాలకు పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం 2021 ఏడాదికి సాహితీ పురస్కారాలు ప్రకటించింది. జిల్లాకు చెందిన ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడును నవలా ప్రక్రియలో 'బహుళ' రచనకు సాహితీ పురస్కారానికి ఎంపిక చేశారు. పురస్కార గ్రహీతకు రూ.20,116లు నగదు అందజేసి సత్కరిస్తారు. సాధారణ పాఠకుల నుంచి కవులు, రచయితలు, విమర్శకులు, నాటక కర్తల నుంచి సూచనలు స్వీకరించి 2018, 2019, 2020 లో వెలువడిన పుస్తకాలు సేకరించి న్యాయనిర్ణేతలతో ఈ పురస్కారాల ను ఎంపిక చేశారు. హైదరాబాద్ వర్సిటీ ప్రాంగణంలో జరిగే ప్రత్యేక ఉత్సవంలో త్వరలో ఈ పురస్కారాలు అందజేయనున్నారు.

మెళియాపుట్టి స్టేషన్ ఆకస్మిక తనిఖీ



మెళియాపుట్టి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ జీఆర్‌రాధిక

మెళియాపుట్టి: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ జీఆర్ రాధిక శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సరిహ ద్దులో నిఘా పెంచాలని సూచించారు. పలు కేసుల కు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. పెండింగ్ కేసులు ఉండకుండా చూడాలని అన్నారు. నాటుసారా క్రయవిక్రయాలు, మత్తుపదార్థాల రవా ణాపై నిఘా పెంచాలని సూచించారు. నూతన భవ న నిర్మాణం కోసం సిబ్బంది విన్నవించారు. పాతపట్నం సీఐ వినోద్ బాబు, ఎస్ఐ రాజేష్, ఏఎస్ఐ నరసింగరావు, పలువురు సిబ్బంది ఉన్నారు.

పర్లాకిమిడిలో శరన్నవరాత్రి ఉత్సవాలు



పర్లాకిమిడి పెద్దబ్రాహ్మణవీధిలో విద్యుత్ తోరణాలు



తెలుగు సొండివీధిలో దుర్గానవరాత్రి ఉత్సవాలు

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో శనివారం రాత్రి నుంచి దసరా నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. పెద్దబ్రాహ్మణవీధిలో వరుసగా 48వ ఏడాది ఉత్సవాలు జరుగుతుండటం విశేషం. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణలు ఆకట్టుకుంటున్నాయి. తెలుగు సొండివీధిలో కూడా ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు. టాటా పవర్ డిస్ట్రిబ్యూషన్, జిల్లా ప్రజా ఆరోగ్యశాఖ, విద్యుత్ శాఖ, ఇరిగేషన్ తదితర ప్రభుత్వ శాఖలు కూడా నవరాత్రి ఉత్సవాలకు సిద్ధమయ్యాయి.

భళా భారత్



ప్రపంచకప్‌లో పాకిస్థాన్‌పై అద్భుత విజయం సాధించిన టీమిండియా జట్టుకు అంతర్జాతీయ సైకత శిల్పి సుదర్శన్ పట్నాయక్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. పూరీ సాగర తీరంలో సైకత శిల్పం ఆవిష్కరించి అభిమానులు, సందర్శకులు, పర్యాటకుల దృష్టిని ఆకట్టుకున్నారు.

– భువనేశ్వర్

ముగిసిన ఎస్‌డీసీ క్రీడా పోటీలు



షీల్డు, నగదు అందుకుంటున్న ఫుట్‌బాల్ పోటీ విజేత ధనపూర్ జట్టు

జయపురం: జయపురం సమితి స్థాయిలో జరిగిన ఎస్‌డీసీ–2023లో ఫుట్‌బాల్ విభాగంలో ధనపూర్, వాలీబాల్ విభాగంలో అంత గ్రామ పంచాయతీల జట్లు విజేతలుగా నిలిచాయి. శనివారం జరిగిన ఫైనల్స్‌లో జయపురంపై ధనపూర్, కలియాగాంపై అంత పోటీలు గెలుపొంది ట్రోఫీలు కైవసం చేసుకున్నాయి. విజేతలు, రన్నరప్‌లకు జయపురం సబ్‌కలక్టర్ ప్రభాత్ కుమార్ పరిడ, జయపురం మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ బి.సునీత షీల్డ్‌లు అందజేశారు. కార్యక్రమంలో జయపురం సమితి బీడీఓ రాజీవ్‌దాస్, సమితి అధ్యక్షురాలు తిలోత్తమ నాయిక్, ఎస్‌డీపీ సభ్యులు బైద్యనాథ్ నాయిక్, టుంకుదొర హల్వ, జిల్లా పరిషత్ సభ్యులు త్రిపతి పట్నాయక్, రశ్మి రథొ, సూర్యనారాయణ రథ్, అనూప్‌కుమార్ పాత్రో, రబి నాయిక్ తదితరులు పాల్గొన్నారు.



షీల్డు అందుకుంటున్న వాలీబాల్ పోటీల విజేత అంత జట్టు

అక్కచెల్లెమ్మలకు ఆర్థిక దన్ను

● ఎస్సీ, ఎస్టీ మహిళల ఆర్థిక ప్రగతికి ప్రభుత్వం ఊతం
● కొత్తగా ఉన్నతి మహిళా శక్తి పథకానికి శ్రీకారం
● ఆటో కొనుగోళ్లకు వడ్డీలేని రుణం మంజూరు
● జిల్లాకు 9 చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 220 యూనిట్ల పంపిణీ
● డిసెంబరు 6న పథకం పంపిణీకి కసరత్తు


పథకంపై స్వయం సహాయక గ్రూపు మహిళలకు అవగాహన కల్పిస్తున్న వైకేపీ సిబ్బంది

సీతంపేట: అధికారంలోకి వచ్చిన తొలినాళ్ల నుంచి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మహిళా ప్రగతే లక్ష్యంగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే పలు ప్రభుత్వ పథకాల ద్వారా అన్ని వర్గాల్లోని మహిళలకు న్యాయం చేసిన జగనన్న సర్కారు మరో అడుగు ముందుకు వేసింది. ఎస్సీ, ఎస్టీ మహిళల జీవన స్థితిగతులు మెరుగుపరిచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఆర్థిక భరోసా కల్పించి, వారిని ఉన్నత స్థాయిలో నిలిపేందుకు కృషి చేస్తోంది. దీనికోసం ప్రత్యేకంగా ఉన్నతి మహిళా శక్తి పథకాన్ని ప్రభుత్వం తీసుకువస్తోంది. వైఎస్సార్ క్రాంతి పథం ఆధ్వర్యంలో రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) ద్వారా ఈ పథకంలో భాగంగా ఆటోల కొనుగోళ్లకు వడ్డీలేని రుణం ఇస్తారు. అర్హులైన ప్రతీ లబ్ధిదారునికి రూ.3 లక్షల చొప్పున రుణం మంజూరు చేస్తారు. ఈ రుణాన్ని వడ్డీ లేకుండా వాయిదాల పద్ధతిలో తీర్చుకునే వెసులుబాటును లబ్ధిదారులకు కల్పించారు. జిల్లాకు తొమ్మిది మంది చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 220 యూనిట్ల పంపిణీకి రంగం సిద్ధం చేస్తున్నారు. దీనిలో భాగంగా మన జిల్లా నుంచి తొమ్మిది మంది లబ్ధిదారులను ఎంపిక చేసే పనిలో ఏపీఎంలు నిమగ్నమయ్యారు. డిసెంబరు ఆరో తేదీన ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు.

ఇవీ అర్హతలు..
● స్వయం సహాయ సంఘ(ఎస్‌హెచ్‌జీ) సభ్యురాలై, ఎస్సీ, ఎస్టీ కులానికి చెందిన వారు అర్హులు.
● గతంలో ఎటువంటి రుణం తీసుకుని, ఉండకూడదు.
● లబ్ధిదారులు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి.
● డ్రైవింగ్ చేస్తూ తీసిన వీడియో ఉండాలి.
● ఆటో కొనుగోలు చేసినపుడు 10 శాతం వాటాను మూలధనంగా పెట్టుబడి పెట్టాలి.
▲ గ్రామీణ ప్రాంతంలో నివసించి ఉండాలి.
▲ డీజిల్ ఆటోనా, గ్యాస్ ఆటోనా.. ట్రాలీ ఆటోనా అనేది లబ్ధిదారులే ఎంపిక చేసుకోవాలి.
▲ స్వయం సహాయక గ్రూపు, వీవో తీర్మానం తప్పనిసరి.

విజయవాడలో ప్రత్యేక శిక్షణ..



ఆటో నడపడం, రిపేరు వంటి అంశాలకు సంబంధించి, లబ్ధిదారులకు విజయవాడలో ప్రత్యేక శిక్షణ ఇస్తాం. శిక్షణ కాలంలో శిక్షణార్థులకు ఉచితంగా భోజనం, వసతి సదుపాయాలు కల్పిస్తాం. ఇప్పటివరకు 12 మంది లబ్ధిదారులను ఎంపిక చేశాం.
–పార్వతి, ఉన్నతి ఇన్‌చార్జ్ ఏపీఎం, ఐటీడీఏ, సీతంపేట.

లబ్ధి పొందిన తర్వాత..
▸ లబ్ధిదారు పేరిట రిజిస్ట్రేషన్ చేయాలి.
▸ తప్పనిసరిగా ఇన్సూరెన్స్ చేసుకోవాలి.
▸ లబ్ధిదారులే ఇన్సూరెన్స్, రిజిస్ట్రేషన్ ఫీజులు భరించాల్సి ఉంటుంది.
▸ 48 నిర్ణీత వాయిదాలు వడ్డీలేని రుణం చెల్లించాలి.
▸ సకాలంలో లోన్(రుణం) చెల్లించని వారికి అపరాద రుసుం విధించబడుతుంది.

క్లుప్తంగా

సమృద్ధిగా సాగునీరు


షాలిపేట సైఫన్ వద్ద పుష్కలంగా సాగునీటి ప్రవాహం

సంతకవిటి: నారాయణపురం ఆనకట్ట నుంచి కుడికాలువలోకి శనివారం నాటికి పూర్తిస్థాయిలో సాగునీరు విడుదల చేసినట్టు డీఈ మురళీమోహన్, ఏఈఈలు రవికుమార్, రమణ తెలిపారు. ఇటీవల కుడికాలువపై ఉన్న సైఫన్ గోడ నీటిధాటికి కూలిపోయిన సంగతి తెలిసిందే. దీనిని యుద్ధ ప్రాతిపదికన నిర్మించారు. ఆయకట్టుకు అవసరమైన నీటిని విడిచిపెట్టారు.

రెవెన్యూలో డిప్యుటేషన్లు

విజయనగరం అర్బన్: రెవెన్యూశాఖలో వివిధ కేడర్ ఉద్యోగులను డిప్యుటేషన్‌పై నియమిస్తూ కలెక్టరేట్ నుంచి శనివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. తహసీల్దార్లు ముగ్గురు, డిప్యూటీ తహసీల్దార్ కేడర్‌లోని తొమ్మిది మందికి, సీనియర్ అసిస్టెంట్లు ముగ్గురికి డిప్యుటేషన్ చేశారు. సంతకవిటి మండల తహసీల్దార్ ఎ.సులోచనరాణికి రామభద్రపురం తహసీల్దార్‌గా, ఇక్కడ పనిచేస్తున్న ఎన్.రాజారావుకు సంతకవిటి, ఆర్.ఆముదాలవలస తహసీల్దార్‌గా కలెక్టరేట్ కేఆర్ఆర్‌సీలో పనిచేస్తున్న టి.కళ్యాణచక్రవర్తికి ఎల్.కోట మండల తహసీల్దార్‌గా స్థానాలను మార్చారు. బొబ్బిలిలో ఎన్నికల డీటీగా పనిచేస్తూ ఇటీవల విజయనగరం సీఎస్‌డీటీగా ఇచ్చిన ఆదేశాలను రద్దు చేస్తూ ఎస్.కోట సీఎస్‌డీటీగా ఎం.శ్రీనివాసరావుకు డిప్యుటేషన్ ఆదేశాలిచ్చారు.
● నెల్లిమర్ల ఎన్నికల డీటీ ఆర్.ఈశ్వరమ్మను ఎల్.కోట సీఎస్‌డీటీగా, ఎస్.కోట సీఎస్‌డీటీ ఎన్‌వీవీఎస్ మూర్తిని నెల్లిమర్ల ఎన్నికల డీటీగా, సివిల్ సప్లై కార్పొరేషన్ డీఎం పరిధిలోని ఎస్.కోట ఎల్ఎల్ఎస్ పాయింట్ డీటీగా పనిచేస్తున్న ఎ.రామారావును విజయనగరం సీఎస్‌డీటీగా స్థాన చలనం చేశారు. విజయనగరం సీఎస్‌డీటీగా పనిచేస్తూ ఇటీవల బొబ్బిలి ఎలక్షన్ డీటీగా ఇచ్చిన ఆదేశాలను రద్దు చేస్తూ తాజాగా చీపురుపల్లి ఎస్‌డీసీ (ఎల్ఏ) టీబీపీ యూనిట్-2కి ఎం.వి.వి.జగన్నాథరావును స్పెషల్ డిప్యూటీ తహసీల్దార్‌గా, అక్కడ పనిచేస్తున్న కె.వరప్రసాద్‌కు రామభద్రపురం మండలంలో హెచ్‌డీటీగా స్థాన చలనం జరిగింది. అక్కడ పనిచేస్తున్న టీకేవీఎస్ సుబ్బారావుకు బొబ్బిలి ఎలక్షన్ డీటీగా, చీపురుపల్లి ఎలక్షన్ డీటీ మల్లాపురెడ్డి శ్రీనుకు గరివిడి హెచ్‌డీటీగా, అక్కడ పనిచేస్తున్న బి.సురేష్‌కు చీపురుపల్లి ఎలక్షన్ డీటీగా డిప్యుటేషన్ చేశారు.
● సీనియర్ అసిస్టెంట్లు ముగ్గురికి కూడా డిప్యూటేషన్ చేశారు. గజపతినగరం మండలంలో ఎలక్షన్ విభాగంలోని ఎస్.అరుణకుమారికి గంట్యాడ మండల తహసీల్దార్ కార్యాలయం, అక్కడ పనిచేస్తున్న ఎస్ఎస్ఎస్ఎన్ రాజుకు గజపతినగరం ఎలక్షన్ విభాగానికి స్థానచలనం చేశారు. బొబ్బిలి తహసీల్దార్ కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్ ఎం.కృష్ణమూర్తిని అదే మండలం ఎన్నికల విభాగానికి డిప్యుటేషన్ చేశారు.

తుపాకీతో బెదిరించిన వ్యక్తి అరెస్ట్


పోలీసులు స్వాధీనం చేసుకున్న తుపాకీ

జామి: తుపాకీతో లారీ డ్రైవర్‌ను బెదిరించిన ఘటనలో మండలంలోని గదబపాలెం గ్రామానికి చెందిన లగుడు నాయుడు అనే వ్యక్తిని పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. సీఐ బాలసూర్యారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. కొన్నిరోజుల క్రితం గదబపాలెంలో ఓ వ్యక్తి మద్యంమత్తులో అతడికి చెందిన నాటుతుపాకీని లగుడు నాయుడు దగ్గర మర్చిపోయి వదిలేసి వెళ్లిపోయాడు. శుక్రవారం రాత్రి గ్రీన్‌ఫీల్డ్ హైవే పైకి లగుడు నాయుడు వచ్చి, అదే తుపాకీతో అటువైపుగా వస్తున్న లారీ డ్రైవర్ ప్రసాద్‌ను బెదిరించాడు. దీనిపై లారీ డ్రైవర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసిన పోలీసులు, అతడిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. అనంతరం అతడి వద్ద ఉన్న తుపాకీని స్వాధీనం చేసుకున్నారు.

క్రీడాస్ఫూర్తితో మెలగాలి


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వీసీ ప్రశాంత కిషోర్ మహంతి

నెల్లిమర్ల రూరల్: విద్యార్థులు క్రీడాస్ఫూర్తితో మెలగాలని వీసీ ప్రొఫెసర్ ప్రశాంత కిషోర్ మహంతి పిలుపునిచ్చారు. జాతీయ చదరంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని టెక్కలి సెంచూరియన్‌లో చెస్, వాలీబాల్, క్రికెట్, బాస్కెట్ బాల్ పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి ఉన్నత స్థానాల్లో స్థిరపడిన క్రీడాకారులను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం పరిశోధన పత్రాల తయారీ అంశంపై అధ్యాపకులకు అవగాహన కల్పించారు. నాక్ గుర్తింపునకు పరిశోధనా పత్రాలు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో వర్సిటీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్‌పీలపై చర్యలు తీసుకుంటాం

● వారు స్వాహా చేసిన నిధులు రికవరీ చేస్తాం
● మహిళా సంఘాల సమావేశంలో రాజాం రూరల్ సీఐ ఎస్.శ్రీనివాసరావు


సీఐ శ్రీనివాసరావుతో తమ గోడు వెల్లబుచ్చుకుంటున్న బాధిత మహిళలు

రాజాం సిటీ: తప్పు చేసిన ఆర్‌పీలపై చర్యలు తీసుకుంటామని రాజాం రూరల్ సీఐ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటివలస గ్రామంలో డ్వాక్రా సంఘాల మహిళలు, అవకతవకలకు పాల్పడిన ఆర్‌పీలు, మెప్మా సిబ్బందితో సమావేశమైన ఆయన తొలుత సంఘాల వారీగా డబ్బులు దుర్వినియోగమైన తీరును మెప్మా టీఎంసీ ఎస్‌వీ రత్నంను అడిగితెలుసుకున్నారు. అనంతరం మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మహిళలు ఒక్కొక్కరుగా తమ గోడు వెల్లబుచ్చుకున్నారు. సంఘ సభ్యులకు తెలియకుండా, ఫోర్జరీ సంతకాలతో, తప్పుడు తీర్మానాలు చేసి లోనులు(రుణాలు) వాడుకున్న తీరును వివరించారు. ఆర్‌పీలు స్వాహా చేసిన సొమ్మును రికవరీ చేసి, అందరికీ న్యాయం జరిగేలా చూస్తామని సీఐ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, తాను వాడుకున్న డబ్బులను బ్యాంకుకు కట్టేస్తానని ఆర్‌పీ ఉమాదేవి అంగీకరించింది. అయితే లలితాంబ, అన్నమ్మపేరంటాల, వెంకటేశ్వరతో పాటు మరో గ్రూపునకు సంబంధించిన డబ్బులు కట్టేదిలేదని తెగేసి చెప్పడంతో బాధిత మహిళలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని సీఐను కోరారు. సోమవారం మరోసారి స్టేట్‌మెంట్‌లను తనిఖీ చేసి, న్యాయం జరిగేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. మహిళలంతా సంయమనం పాటించాలని, ఎలాంటి తప్పుడు నిర్ణయాలు తీసుకోవద్దన్నారు. సమావేశంలో సంతకవిటి ఎస్ఐ బి.లోకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సునాయాసంగా కేరళ, బరోడా, మధ్యప్రదేశ్ జట్ల విజయం


విజ్జి స్టేడియంలో కేరళ-బీహార్ జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్ దృశ్యం

విజయనగరం రూరల్: జిల్లా కేంద్రంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో వారం రోజులుగా జరుగుతున్న అంతర్ రాష్ట్ర అండర్-19 మహిళల వన్డే క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ఉల్లాసంగా, ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. శనివారం జిల్లాలోని మూడు వేదికల్లో జరిగిన మ్యాచ్‌లలో బీహార్‌పై కేరళ జట్టు, మిజోరంపై బరోడా జట్టు, అస్సాంపై మధ్యప్రదేశ్ జట్టు సునాయాసంగా విజయం సాధించాయి. జిల్లా కేంద్రం శివారులోని సర్ విజ్జి క్రికెట్ స్టేడియంలో కేరళ, బీహార్‌ల మధ్య జరిగిన మ్యాచ్‌లో బీహార్‌పై కేరళ జట్టు 9 వికెట్ల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన బీహార్ జట్టు 35.4 ఓవర్లలో 93 పరుగులు చేసి, ఆలౌటైంది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కేరళ జట్టు 20 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 96 పరుగులు చేసి, విజేతగా నిలిచింది. డెంకాడ మండలంలోని చింతలవలసలో డాక్టర్ పీవీజీ రాజు నార్త్‌జోన్ క్రికెట్ అకాడమీ మైదానంలో బరోడా, మిజోరం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో బరోడా జట్టు 7 వికెట్ల తేడాతో ప్రత్యర్థి జట్టుపై విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన మిజోరం జట్టు 26.1 ఓవర్లలో కేవలం 44 పరుగులు చేసి, ఆలౌట్ కాగా 45 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన బరోడా జట్టు కేవలం 4.3 ఓవర్లలోనే విజయలక్ష్యం చేరుకుంది. ఇదిలా ఉండగా, దాకమర్రి సమీపంలోని కందుకూరి క్రికెట్ మైదానంలో మధ్యప్రదేశ్, అస్సాం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో మధ్యప్రదేశ్ జట్టు 8 వికెట్ల తేడాతో గెలుపొంది, టోర్నీలో వరుసగా నాలుగో విజయాన్ని నమోదు చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన అస్సాం జట్టు 31.5 ఓవర్లలో 83 పరుగులు చేసి, ఆలౌటైంది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన మధ్యప్రదేశ్ జట్టు కేవలం 16 ఓవర్లలోనే 87 పరుగులు చేసి, విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది.

20 నుంచి రాష్ట్రస్థాయి చెస్ చాంపియన్‌షిప్ పోటీలు



రాష్ట్రస్థాయి చెస్ చాంపియన్‌షిప్ పోటీల బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

● జిల్లా వేదికగా 4 రోజుల పాటు జరగనున్న పోటీలు
● బ్రోచర్‌ను ఆవిష్కరించిన చెస్ అసోసియేషన్ ప్రతినిధులు

విజయనగరం: క్రీడల ఖిల్లా విజయనగరం వేదికగా ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకు అండర్-13 బాల, బాలికల రాష్ట్రస్థాయి చెస్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్టు జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.ఎ.రావు, కె.వి.జ్వాలాముఖి వెల్లడించారు. టోర్నీ నిర్వహించే లార్వెన్స్ స్కూల్ ప్రాంగణంలో నిర్వాహకులు రవిమండాతో కలిసి రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్ పోటీల బ్రోచర్లను శనివారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ అండర్-13 విభాగంలో ముడిదాంలోని లార్వెన్స్ స్కూల్‌లో నాలుగు రోజుల రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు జరగనున్నాయని తెలిపారు. పోటీల్లో వివిధ జిల్లాల నుంచి 250 నుంచి 300 మంది క్రీడాకారులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. అంతర్జాతీయ చెస్ అసోసియేషన్ మార్గదర్శకాల ప్రకారం టోర్నమెంట్ నిర్వహణ జరుగుతుందన్నారు. నాలుగు రోజుల పాటు జరగనున్న టోర్నమెంట్‌కు వచ్చే క్రీడాకారులకు, వారితో వచ్చే తల్లితండ్రులకు భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. పోటీల్లో విజేతలైన వారిని హైదరాబాద్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు. రాష్ట్రస్థాయి చెస్ చాంపియన్ షిప్ పోటీల్లో విజయవంతంగా నిర్వహించేందుకు క్రీడాకారులు, క్రీడా సంఘాలు, ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు జిల్లా చెస్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పాముకాటుతో వ్యక్తి మృతి


మృతుడు సన్యాసి నాయుడు

గంట్యాడ: పాముకాటుతో సన్యాసినాయుడు (52) అనే వ్యక్తి మృతి చెందిన విషాద ఘటన మండలంలోని మదనాపురంలో శుక్రవారం చోటుచేసుకుంది. రాత్రి భోజనానంతరం ఇంట్లో పడుకున్న ఆయనను అటువైపుగా వచ్చిన పాము కాటువేసింది. ఒక్కసారి ఉలిక్కిపడి లేచిన అతడు ఏదో కరిచినట్లు అనిపించిందని కుటుంబ సభ్యులకు తెలిపాడు. పాము కరిచి ఉంటుందని చెప్పి, అతడిని దగ్గరలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున ఆయన మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ శ్రీరాములు తెలిపారు.

వాహనం ఢీకొని యాచకుడు..


మృతి చెందిన యాచకుడు

కొత్తవలస: గుర్తు తెలియని వాహనం ఢీకొని యాచకుడు దుర్మరణం చెందిన ఘటన మండలంలోని అరకు-విశాఖ రోడ్డులోని నిమ్మలపాలెం గ్రామం సమీపంలో రాయి చెరువు వద్ద శనివారం తెల్లవారుజామున జరిగింది. ఎస్ఐ వీరజనార్దన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. గత కొంతకాలంగా జిందాల్, నిమ్మలపాలెం పరిసర ప్రాంతాల్లో బిచ్చమెత్తుకుంటూ జీవిస్తున్న అతడు వాహనం ఢీకొని, తీవ్రగాయాలతో అపస్మారక స్థితిలో ఉండడం చూసి, స్థానికులు గమనించారన్నారు. వారు అతడిని వైద్యసేవల నిమిత్తం 108 అంబులెన్స్‌లో విశాఖ కేజీహెచ్‌కు తరలించారన్నారు. అక్కడే చికిత్స పొందుతుండగా అతడు చనిపోయినట్లు తెలిపారు. ఈ మేరకు నిమ్మలపాలెం రెవెన్యూ కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

దైవదర్శనం చేసుకుని, వస్తుండగా..


సంఘటన స్థలంలో తీవ్రగాయాలతో అప్పారావు

పార్వతీపురం టౌన్: స్థానిక ఎస్పీ కార్యాలయం జంక్షన్‌లో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కైంకర్యం అప్పారావు(63) మృతి చెందగా, ఆయన భార్య లక్ష్మికి తీవ్రగాయాలయ్యాయి. పార్వతీపురం ఆస్పత్రి అవుట్‌పోస్ట్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. పార్వతీపురంలోని వైకేఎం కాలనీ, బాలాజీనగర్‌కు చెందిన అప్పారావు తన భార్యతో కన్యకాపరమేశ్వరి ఆలయానికి వెళ్లి, దైవదర్శనం చేసుకుని తిరిగివస్తుండగా, వారికి ఎదురుగా ఇద్దరు యువకులతో వస్తున్న మోటార్‌బైక్ వారి బైక్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో భార్యాభర్తలిద్దరూ తీవ్రగాయాలపాలు కాగా అప్రమత్తమైన స్థానికులు వైద్యసేవల నిమిత్తం వారిని ఆటోలో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అప్పారావు పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం విశాఖపట్నం కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. ఈ క్రమంలో అతడిని విశాఖపట్నం తీసుకువెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. పోస్టుమార్టం కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రి మృతదేహం తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

దొంగలు దొరికారు..


చైన్ స్నాచింగ్ కేసు వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ సీఐ వెంకటరావు, వెనక ముసుగులో నిందితులు

విజయనగరం క్రైమ్: చైన్ స్నాచింగ్ కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు వెల్లడించారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో విలేకరులతో మాట్లాడిన ఆయన ప్రదీప్‌నగర్ శారదా అపార్ట్‌మెంట్‌లో వాచ్‌ఉమెన్‌గా పనిచేస్తున్న ఉడిగల గౌరి అనే మహిళ ఈ నెల 10వ తేదీ సాయంత్రం 3:45 గంటల సమయంలో ఇస్త్రీ చేసిన బట్టలను ఇంటికి తీసుకువెళ్తుండగా, గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి, ఆమె మెడలోని రెండు తులాల బంగారు పుస్తెలతాడును లాక్కొని, పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టిన పోలీసులు కొన్ని ఆధారాలు సేకరించారు. శనివారం స్థానిక గూడ్స్‌షెడ్ వద్ద వన్‌టౌన్ ఎస్ఐ వి.అశోక్‌కుమార్ సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేపట్టగా, అనుమానాస్పదంగా బైక్‌పై వస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, విచారణ చేశారు. ఈ విచారణలో భీమిలి మండలంలోని వలదపేటకు చెందిన కోనాడ రాంబాబు, కమ్మవీధికి చెందిన బేతా లల్లూ అనే ఇద్దరిని అరెస్ట్ చేసి, వారి దగ్గర నుంచి దొంగిలించిన రెండు తులాల బంగారు పుస్తెలతాడు, 4 కిలోల గంజాయి, ఓ మోటారు బైక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కేసు ఛేదనలో క్రియాశీలక పాత్ర పోషించిన ఎస్ఐ అశోక్‌కుమార్, హెచ్‌సీ ఎం.అచ్చిరాజు, కానిస్టేబుళ్లు టి.శ్రీనివాస్, బి.శివ, బి.శివశంకరరావు, ఎన్.గౌరీశంక్‌లను సీఐ అభినందించారు. సమావేశంలో ఎస్ఐ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటాలి


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా జట్ల సభ్యులు

● జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.విజయకుమార్

తెర్లాం: రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లాకు చెందిన రెండు జట్లు తమ సత్తాను చాటాలని జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.విజయకుమార్ ఆకాంక్షించారు. మండలంలోని నెమలాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా జట్లను శనివారం ఎంపిక చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన బాల,బాలికల జట్లను ఉద్దేశించి, కాసేపు మాట్లాడారు. చిత్తూరు జిల్లాలోని నగరిలో ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు జరగనున్న అండర్-19 బాలబాలికల రాష్ట్ర స్థాయి పోటీల్లో క్రీడాకారులంతా తమ అత్యుత్తమ ప్రతిభను కనబరిచి, పతకాలు సాధించాలని, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శ్రీధర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీనివాసరావు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా జట్ల సభ్యులను అభినందించారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి 60 మంది క్రీడాకారులు జిల్లా జట్ల ఎంపికలో పాల్గొన్నారు.

పోయిన బ్యాగు అప్పగింత


ప్రయాణికురాలు పోగొట్టుకున్న బ్యాగును అప్పగిస్తున్న పోలీసులు

రేగిడి: వీరఘట్టం మండలంలోని కొంచ గ్రామానికి చెందిన బోనంగి కీర్తన బస్సులో పోగొట్టుకున్న బ్యాగును ఆమెకు పోలీసులు తిరిగి అప్పగించారు. బెంగళూరు నుంచి ఆర్టీసీ బస్సులో వస్తుండగా ఆమె తన లగేజీ బ్యాగు పోయినట్లు స్థానిక పోలీసులను శనివారం ఆశ్రయించి, ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి, రంగంలోకి దిగిన పోలీసులు అపహరణకు గురైన ఆమె బ్యాగును 24 గంటలు గడవకముందే పట్టుకుని, ఆమెకు అందించారు. దీంతో ఆమె, ఆమె కుటుంబ సభ్యులు ఎస్ఐ శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

సిరిమాను చెట్టుకు ప్రత్యేక పూజలు


సిరిమాను చెట్టుకు పూజలు చేస్తున్న ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ గదల బంగారమ్మ

నెల్లిమర్ల: జరజాపుపేటలో గుర్తించిన పైడితల్లి సిరిమాను చెట్టుకు భక్తులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ గదల బంగారమ్మ శనివారం చెట్టును దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పైడితల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. అలాగే ఆర్డీఓ ఎంవీ సూర్యకళ, ఏఎస్పీ అస్మాపర్వీన్, తదితరులు చెట్టును దర్శించుకున్నారు. కార్యక్రమాల్లో పైడతల్లి ఆలయ ఈఓ సుధారాణి, విద్యుత్‌శాఖ ఎస్ఈ లక్ష్మణరావు, నగర పంచాయతీ వైస్‌చైర్మన్ సముద్రపు రామారావు, తహసీల్దార్ డి. ధర్మరాజు, ఎస్సై నారాయణరావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఓం మందిరంలో కోటి కుంకుమార్చన

విజయనగరం టౌన్: పట్టణంలోని సాయినాథ్ కాలనీలో ఉన్న ఓం మందిరంలో భగవాన్ శ్రీ సత్య సాయి బాబా 98వ జయంతి సందర్భంగా కోటి కుంకుమార్చన నిర్వహించనున్నట్లు ఓం మందిరం కన్వీనర్ జి.సన్యాసినాయుడు తెలిపారు. ఈ మేరకు ఆలయ ఆవరణలో శనివారం కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, నేటి నుంచి ఈ నెల 24 వరకు ప్రతిరోజూ కోటి కుంకుమార్చన నిర్వహిస్తామన్నారు. ప్రతిరోజూ ఆలయానికి వచ్చే భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సేవాదళ్ ఇన్‌చార్జ్ ఎస్.అనితాదేవి, కేవీ రమణ, పైడి శ్రీనివాసరావు, సీహెచ్.రామారావు, కె.మదన్‌మోహన్, బి.శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు


ఎమ్మెల్సీ సురేష్‌బాబును సన్మానిస్తున్న డల్లాస్ వైఎస్సార్‌సీపీ సభ్యులు

● సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పరిపాలనా సంస్కరణలు
● అమెరికా డల్లాస్‌లోని వైఎస్సార్ సీపీ సన్మాన సభలో ఎమ్మెల్సీ డాక్టర్ సురేష్‌బాబు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: ఎలాంటి వివక్ష లేకుండా అర్హతే ప్రామాణికంగా ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్సీ డాక్టర్ పీవీవీ సూర్యనారాయణరాజు (పెనుమత్స సురేష్‌బాబు) అన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం అమలుచేస్తున్న పరిపాలనా సంస్కరణలతో ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతోందని వివరించారు. అమెరికాలోని డల్లాస్ నగరం ఫ్రిస్కోలో శనివారం ఉదయం వైఎస్సార్ సీపీ యూఎస్ఏ కమిటీ, డల్లాస్ వైఎస్సార్‌సీపీ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమానికి సురేష్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయనను పార్టీ సభ్యులు ఘనంగా సన్మానించారు. అనంతరం సురేష్‌బాబు మాట్లాడుతూ జాతిపిత గాంధీజీ, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆశించిన మార్పును ప్రస్తుతం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేస్తున్నారని చెప్పారు. పరిపాలనా సంస్కరణలతో ఆంధ్రప్రదేశ్ మన్ననలు అందుకుంటోందన్నారు. అర్హత ఒక్కటే ప్రామాణికంగా సంక్షేమ పథకాల అమలుతీరు అమోఘమని, ఇతర రాష్ట్రాలకు ఆదర్శప్రాయంగా ఉందని చెప్పారు. అమెరికాలో వైఎస్సార్‌సీపీ విస్తరణకు పార్టీ సభ్యులు కృషి చేయాలని కోరారు.